# మామిడి క్యాలెండర్

* మే నెల చివరికి పంటకాలం పూర్తి అయిన తరువాత సుమారు 20రోజులు మామిడి చెట్లకు విశ్రాంతి ఇవ్వవలెను.

**జూన్ నెల 20 నుంచి:**

* వర్షపు నీరు ఇంకుటకు నాలుగు చెట్ల సాళ్ళ మధ్య ఒక అడుగు లోతుగల కందకాలను వాలుకు అడ్డంగా తీయవలెను.
* మధ్యాహ్నం 12 గంటలకు ఎండని బట్టి ఏర్పడిన చెట్టు నీడ పడినంత వరకు చెట్టు చుట్టూ అడుగు లోతు గుంటను త్రవ్వవలెను. అందులో ఎండిన, లేదా విరిగిన, లేదా తెగుల సోకిన కొమ్మలను పదునైన రంపంతో కోసి అందులో వేయవలెను..
* సూర్యరశ్మి చెట్టుకు బాగా తగులటకు గుబురుగా ఉన్న చెట్టు పై కొమ్మలను తొలగించవలెను.
* అలాగే రెండు చెట్ల మధ్య సుమారు 4 అడుగుల దూరం ఉండేలా కొమ్మలను రంపంతో తొలగించాలి.
* దీని వలన సూర్యరశ్మి మామిడి చెట్లకి పూర్తిగా తాకి ఆహారం తయారుచేసుకొనుటకుఉపయోగపడుతుంది.
* కొమ్మలను తొలగించిన చోట నీమ్‌ఫేస్ట్ వ్రాయవలెను.
* పంటల అవశేషాలు లేదా కలుపు మొక్కలను కత్తిరించి కందకాలలో వేసి, తడిగా ఉన్నపుడు తయారు చేసుకున్న జీవామృతం కందకాలలో వేయాలి.

**జూన్ నెల 25 వ తేదీ:**

* 10 లీటర్ల జీవామృతాన్ని 150 లీటర్ల నీటిని కలిపి చెట్ల మీద పిచికారి చేయాలి.
* మామిడి చెట్టు మొదల్లో చెదలు కాని పిచ్చి మొక్కలను తొలగించాలి
* ఎర్రమట్టి, ఆవుపేడ,ఆవుమూత్రంతో కలిపి తయారు చేసుకున్న మిశ్రమాన్ని మామిడి చెట్టు మొదలు క్రింది నుంచి 2 అడుగులు విడిచిపెట్టి ఒక అడుగు వెడల్పుతో మొదలు చుట్టూ రాయాలి.

**జూలై నెల**

* తోటల్లో పచ్చిరొట్ట ఎరువు కొరకు - జనుము, జీలుగ, పెసర, మినుము, ఉలవలు ఏకదళ బీజ పంటలైన - రాగులు, సజ్జలు, జొన్నల లాంటివి కలిపి పండించాలి.
* పంటలు తీసుకున్న తరువాత అవశేషాలు చెట్ల క్రింద చుట్టూవేసి జీవామృతాన్ని చెట్టుకు షుమారు 5 లీటర్లు చుట్టూతా చల్లాలి.

| | |
|---|---|
| | * అంతర పంటలుగా గ్లైరిసిడియా, మునగ చెట్లను ప్రతి నాలుగు చెట్ల మధ్య నాటుకుని పెంచడం వలన మరియు పప్పుధాన్య పంటలను పండించటం వలన వాతావరణంలో పుష్కలంగా ఉన్న నత్రజని భూమిలో స్థిరపరచబడి మామిడి చెట్లకు ఉపయోగపడుతుంది.<br>* జీవామృతాన్ని భూమిపైననూ, నీటిని కలిపి చెట్ల మీద ప్రతి నెల ఒకసారి పిచికారీ చేయటం వలన భూమిలో జీవన సేంద్రియ పదార్థం ఏర్పడి, వానపాములు, ఇతర మేలు చేసే అనేక సూక్ష్మజీవులు వృద్ధిచెంది చెట్లు ఆరోగ్యంగా పెరగడానికి ఉపయోగపడుతుంది.<br>* పిచికారీ చేయడం వలన జీవామృతంలో కలిసిన గోమూత్రంలో ఉన్న అనేక పోషక పదార్థాలు హార్మోన్లు ఉపయోగపడతాయి. |
| **జూలై నెల 25 వ తేది:** | * 20 లీటర్ల జీవామృతం 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. |
| **ఆగష్టు నెల 5 వ తేది :** | * మామిడి చెట్ల పాదుల్లో తేమ ఉండేలా చూసుకొని, జీవామృతాన్ని చెట్టుక్రింద 5 లీటర్ల చొప్పున పోయాలి.<br>* వర్షాకాలం పూర్తి అయిన తరువాత నేల పొడిగా ఉన్నపుడు జీవామృతం నేలకు అందించవలసిన అవసరం లేదు. |
| **ఆగష్టు నెల 15 వ తేది:** | * 5 లీటర్ల పుల్లటి మజ్జిగ 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. |
| **సెప్టెంబర్ నెల 5 వ తేది:** | * 200 లీటర్ల నీమాస్త్రం పిచికారి చేయాలి. |
| **అక్టోబర్ నెల 25 వ తేది:** | * 20 లీటర్ల జీవామృతం 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి.<br>* మొక్క కాండమునకు భూమి అంచు నుంచి 1 1/2 అడుగు ఎత్తు వరకు సున్నం నీళ్ళలో కలిపి బ్రెష్‌తో కాండమునకు వేయవలెను.<br>* సున్నం ఉదయం పూట మాత్రమే వేయాలి<br>* కాండము చుట్టూ ఫాలీథీన్ కవర్స్‌ను చుట్టవలెను. దాని మీద గ్రీజు కాని ఆయిల్ కాని వ్రాయవలెను. దీని వలన కీటకాలు మొదలు వెంబడి పైకి ఎక్కుటకు వీలుపడదు. |
| **నవంబర్ నెల 5 వ తేది:** | * నీమాస్త్రం తయారు చేసుకుని చెట్లపై పిచికారి చేయుట వలన హాని కలిగించే పురుగుల గ్రుడ్లు నాశనం అవుతాయి. |
| **నవంబర్ నెల 10 వ తేది:** | * 3 లీటర్ల పంచగవ్యము 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయవలెను |
| **నవంబర్ నెల 15 వ తేది:** | * పూతకు ముందు కోడిగ్రుడ్డు, నిమ్మరసం ద్రావణం (నోఫా వారి కరిదీపిక పుస్తకంలో తెలియజేసిన విధంగా) పిచికారీ చేయవలెను. (10 రోజుల ముందుగా కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారు చేసుకొని ఉంచవలెను) |

| | |
|---|---|
| **నవంబర్ నెల 20 వ తేదీ:** | * 5 శాతం వేప కషాయం పూత మొదలయ్యే సమయంలో 20 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. |
| **నవంబర్ నెల 25 వ తేదీ:** | * 5 లీటర్ల దశపర్ణిక కషాయం 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి<br>* సోలార్ క్రిమి సంహారక దీపాలు ఎకరానికి 2 పెట్టవలెను. |
| **డిసెంబర్ నెల 3 వ తేదీ :** | * పూత రావటం మొదలైనపుడు జీవామృతం/పంచగవ్యం నీటితో కలిపి పిచికారీ చేయవలెను.<br>* పూత వచ్చిన తరువాత అనగా తెల్లపూత దశలో ఉన్నపుడు జీవామృతం/ పంచగవ్యం పిచికారీ చేయరాదు. దీని వలన పూత మాడిపోతుంది.<br>* జీవామృతం పూతకు ముందు పిచికారీ చేయడం వలన పూతవచ్చినపుడు పరాగ సంపర్కమునకు తోడ్పడే తేనెటీగలు ఇతర ఈగలు ఆకర్షించబడి పరాగ సంపర్కమునకు తోడ్పడతాయి.<br>* దీని వలన ఆరోగ్యకరమైన పిందెగా మారి పంటరావటానికి ఉపయోగపడుతుంది. |
| **జనవరి నెల 5 వ తేదీ :** | * మామిడి చెట్లకు పూత పూర్తిగా వచ్చి పిందెగా మారిన తరువాత జీవామృతం నీటిలో కలిపి పిచికారీ చేయాలి. |
| **జనవరి 10 వ తేదీ** | * ఏదైనా తెగులు సూచనలు కనపడినపుడు పుల్లటి మజ్జిగ ద్రవం పిచికారీ చేయాలి. |
| **జనవరి 15 వ తేదీ** | * 3 లీటర్ల పంచగవ్యము 100 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయవలెను |
| **జనవరి 20 వ తేదీ** | * 5 శాతం వేప కషాయం పిందెలు మొదలయ్యే సమయంలో పది రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. |
| **ఫిబ్రవరి 5 వ తేదీ** | * పురుగుల గ్రుడ్లు లేదా చిన్న పురుగులు సూచనలు కనపడినపుడు ముందుగా నీమాస్త్రాన్ని అవసరాన్ని బట్టి 3శాతం బ్రహ్మాస్త్రాన్ని లేదా 3 శాతం ఆగ్నేయాస్త్రాన్ని లేదా దశపర్ని కషాయాన్ని పిచికారీ చేయాలి.<br>* మంచి లక్షణాల కలిగిన కాయల కొరకు 200 లీటర్ల నీటికి 2 లీటర్ల కొబ్బరి నీటిని కాయ కోయటానికి ఒక నెల ముందు పిచికారీ చేయాలి.<br>* సప్తధాన్యాంకుర కషాయం 200 లీటర్ల నీటితో కలిపి పిచికారి చేయాలి. (పండు నాణ్యత కోసం) |